

టాంజానియా జీడి పిక్కలు ముంచేశాయ్!

- అధిక ధర వెచ్చించి దిగుమతి
- మార్కెట్లో పడిపోయిన ధరలు
- బస్తాకు రూ.4వేల వరకు నష్టం
- లబోదిబోమంటున్న వ్యాపారులు



ఆరబెట్టిన విదేశీ జీడి పిక్కలు

పలాస, జనవరి 7(ఆంధ్రజ్యోతి):

పలాస జీడి వ్యాపారులను విదేశీ జీడి పిక్కలు నిలువునా ముంచేశాయి. అధిక ధర చెల్లించి టాంజానియా నుంచి దిగుమతి చేసుకున్న జీడి పిక్కలకు స్థానిక మార్కెట్లో ఆ స్థాయిలో ధర కరువైంది. ఫలితంగా వ్యాపారులు బస్తాపై రూ.4వేల వరకు నష్టపోవాల్సి వస్తోంది. దేశీయ పిక్కల ధరలు కూడా ఆశాజనకంగా లేవు. దీంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు. ఈ సంకాంత్రికైనా ధరలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 400 జీడి పరిశ్రమలు ఉన్నాయి. ఏటా పలాస మార్కెట్‌కు టాంజానియా, ఐవిరికోస్ట్, ఘన, శ్రీలంకతో పాటు ఆఫ్రికా దేశాల నుంచి జీడి పిక్కలు తక్కువ ధరకు దిగమతి అవుతుంతాయి. ఇందుకోసం ప్రత్యేకంగా అంతర్జాతీయ బ్రోకర్లు ఉంటారు. వారి ద్వారా పిక్కలను రప్పించుకోవడం సాధారణం. ఈ క్రమంలో ఇక్కడ ధరలు స్థిరంగా ఉన్న సమయంలో కొందరు వ్యాపారులు టాంజానియా దేశం జీడి పిక్కలకు ఆర్డర్ పెట్టారు. టాంజానియా దేశ పిక్కలు బస్తా (80 కిలోలు) రూ.8వేల వరకూ లభిస్తుందని భావించి.. 20వేల టన్నుల వరకూ దిగుమతి చేసుకునేందుకు బ్రోకర్లకు ముందుగానే కొంతమేర నగదు చెల్లించారు. కాగా అంత ర్జాతీయ మార్కెట్‌లో ఒడి దుడుకుల కారణంగా ఆ పిక్కలు పలాస వ్యాపారుల వద్దకు వచ్చే సరికి జీఎస్‌టీతో సహా రూ.బస్తా (80 కిలోలు) రూ.17,500 ధర పడింది. అయితే, ప్రస్తుత మార్కెట్‌లో బస్తా ధర రూ.14,500వరకు ఉంది. దీంతో బస్తాకు రూ.3వేల వరకు వ్యాపారులు నష్ట పోతున్నారు. జీడి పప్పు ధరలు తగ్గుముఖం పట్టడంతో అదనంగా మరో రూ.వెయ్యి వరకూ నష్ట పోతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో విదేశీ పిక్కలతో వ్యాపారం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి నాటికి జీడిపిక్కల ధరలు పెరుగుతాయని ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా.. స్థానికంగా లభించే జీడి పిక్కల ధర ఎక్కువగా ఉన్నా వాటిని నిల్వ చేసుకోక పోవడంతో పూర్తిగా కొరత ఏర్పడింది. కొందరు వ్యాపారులు మాత్రం స్థానిక పిక్కలను వేల బస్తాలు కొనుగోలు చేశారు. వారంతా నిర్భయంగా వ్యాపారాన్ని చేసుకుంటున్నారు.

ఈ ఏడాది నష్టమే



ఈ ఏడాది అనుకోకుండా విదేశీ జీడి పిక్కలతో తీవ్ర నష్టం ఏర్పడింది. తితలీ తుఫాన్ దెబ్బ నుంచి కోలుకుంటున్న జీడి వ్యాపారులకు విదేశీ పిక్కలతో మళ్లీ ఉపద్రవం వచ్చింది. తుఫాన్ నష్టం కంటే ఈ నష్టమే అధికంగా ఉంది.

- మల్లా రామేశ్వరరావు, పారిశ్రామికవాడ జీడి వ్యాపారుల సంఘం అధ్యక్షుడు

ప్రభుత్వం ఆదుకోవాలి



నష్టాల నుంచి ప్రభుత్వమే గట్టెక్కించాలి. జీడి పరిశ్రమలను ఆదుకోవాలి. పన్నులు మినహాయిస్తే కొంతవరకూ ఉపశమనం ఉంటుంది.

- మల్లా సురేష్‌కుమార్, జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు

ధరలు పెరుగుతాయని చూస్తున్నాం



సంక్రాంతి నాటికి ధరలు పెరుగుతాయని వేచి చూస్తున్నాం. ఇప్పటివరకు తీవ్ర నష్టాల్లో ఉన్నాం. చిన్న వ్యాపారులు ఇప్పటికే కుదేలయ్యారు. పెద్ద వ్యాపారులు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు.

- కేవీ శివకృష్ణ, జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి

పలాస మార్కెట్‌లో ధరలు

జీడి పప్పు రకం	ధర (కిలో)
జేహెచ్ (బద్ద)	రూ.730-740
180	రూ.850
210	రూ.785
240	రూ.745
320	రూ.715
400	రూ.685

ఐసీడీఎస్‌లో కలకలం

- అధికారిణి అక్రమాలపై ఇంటెలిజెన్స్ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రణస్థలం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో ఓ అధికారిణి అక్రమాల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. అన్నింటా కమీషన్లు వసూలు చేస్తూ.. ఉద్యోగులు, సిబ్బందిపై పెత్తనం చెలాయించే ఆమె తీరుపై.. 'ఎలుకల బోన్లనూ వదల్లే' శీర్షికతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఇంటెలిజెన్స్ వర్గాలు స్పందించాయి. సమస్యలు పరిష్కరించుకుంటూ.. సమన్వయంగా విధులు నిర్వహించాల్సిన చోట కక్షసాధింపు చర్యలు ఏమిటనేదానిపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. కాగా తప్పులు కప్పిపుచ్చుకునేందుకు ఆ అధికారిణి విశ్వప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఐసీడీఎస్‌లో అధికారిణి తీరుతో సూపర్ వైజర్లు, సీడీపీవోలు, కొంతమంది ఉద్యోగులు కొన్నాళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఆమె పొరుగుశాఖ నుంచి వచ్చి.. నియంతగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తామంతా అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుకు కృషి చేస్తున్నామని, కాగా.. కార్యాలయానికి సంబంధం లేని పనులను అప్పగిస్తే ఎవరు చేస్తారంటూ కొంతమంది లోలోపల మథనపడుతున్నారు. అధికారిణి వేధింపులు భరించలేక పలువురు సీడీపీవోలు, ఏసీడీపీవోలు ఉన్నతాధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సైతం కొంతమంది సీడీపీవోల నుంచి ఐసీడీఎస్ ప్రాజెక్టులో జరుగుతున్న తంతుపై ఆరా తీస్తున్నారని సమాచారం. ఆధారాలతో సహా ఆమె అక్రమాలను ఆ శాఖమంత్రి దృషికి తీసుకెళ్లేందుకు కొంతమంది ఉద్యోగులు సన్నద్ధమవుతున్నారు. వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలు.. కూటమి ప్రభుత్వంలో కొనసాగేందుకు వీలు లేకుండా చూడాలని మంత్రిని కోరనున్నట్టు తెలిసింది.

నేడు జడ్పీ బడ్జెట్ సమావేశం

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి7(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సవరణ, అంచనా బడ్జెట్‌ను ఆమోదించేందుకు సమావేశం నిర్వహించనున్నట్టు జడ్పీ సీఈవో శ్రీధర్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'జిల్లా అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చిస్తారు. సమావేశానికి ఆహ్వానం అందిన ప్రజాప్రతినిధులు హాజరు కావాల'ని ఆయన కోరారు. అలాగే 1వ స్థాయీ సంఘ సమావేశాన్ని కూడా నిర్వహిస్తామని తెలిపారు.

రాధాకాంతుడా.. నాటి వైభవం ఏదీ?

- వందలాది ఎకరాలు ఉన్నా ఆదాయం లేదాయె
- కొన్నిచోట్ల నామమాత్రపు లీజుల చెల్లింపు
- దూప, దీప, నైవేద్యానికి కష్టమవుతున్న వైనం
- చోద్యం చూస్తున్న దేవదాయశాఖ
- ఇదీ టెక్కలిలోని ప్రాచీన ఆలయ దుస్థితి



టెక్కలి తెలుగుబ్రాహ్మణవీధిలోని రాధాకాంత మఠం



శిథిలమవుతున్న ఆలయ మండపాలు

టెక్కలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పూరీ ప్రాంతానికి చెందిన మఠాధిపతులతో, దూప, దీప, నైవేద్యాలతో ఒకప్పుడు ఆ ఆలయం కళకళలాడేది. అలాంటి ఆలయం నేడు వెలవెలబోతోంది. రూ.కోట్ల విలువ చేసే భూములున్నా ఆదాయం లేక ఆదరణకు నోచుకోవడం లేదు. కొన్ని భూములు ఆక్రమణలో ఉండగా, మరి కొన్నింటికి నామమాత్రపు లీజుల చెల్లింపుతో రోజురోజుకీ ఆ ఆలయ వెలుగులు మసకబారిపోతున్నాయి. దూప, దీప, నైవేద్యాలకూ కష్టమవుతోంది. ఇదీ టెక్కలి తెలుగు బ్రాహ్మణ వీధిలో రాధాకృష్ణుడు కొలువుదీరిన రాధాకాంతుని ఆలయ దుస్థితి. నాలుగు దశాబ్దాల కిందట దేవదాయశాఖ ఈ ప్రాంతంలో ఉన్న దేవాలయాల ఆస్తులు, సంపదపై కోర్టులో వాజ్యం వేసి గెలిచింది. దీంతో రాధా కాంతుని ఆలయం దేవదాయశాఖ పరిధిలోకి వెళ్లింది. అప్పటి నుంచి ఈ ఆలయానికి గ్రహణం పట్టింది. మండలంలోని గూడేం, మొఖలింగాపురం, నర్సింగపల్లి పంచాయతీల పరిధిలో రాధాకాంతుల ఆలయానికి 300 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. గిరిజనులు, గిరిజనేతరులే ఈ భూములను ఎక్కువగా సాగు చేస్తున్నారు. నర్సింగపల్లి పంచాయతీ నుంచి దశాబ్దాల తరబడి రాధాకాంతుని ఆలయానికి ఆదాయం అందడం లేదు. గూడేం, డమరకు చెందిన కొంతమంది రైతులు నామమాత్రపు లీజులు దేవదాయశాఖకు చెల్లిస్తూ మమ అనిపిస్తున్నారు. ఎకరాకు రూ.500 నుంచి రూ.వెయ్యి చెల్లిస్తున్నా దేవదాయశాఖ పట్టించుకోవడం లేదు. లీజులతో పాటు ఆదాయ వనరులు పెంచడంలో దేవదాయశాఖ అధికారులు విఫలమయ్యా రు. దీంతో కోట్ల రూపాయల విలువ చేసే భూములు ఉన్నా రాధాకాంతుని ఆలయం దైన్యస్థితిలో కొనసాగుతోంది. ఆలయ పైకప్పు ఊడిపోవడంతో స్థానిక యువత కొందరు సొంత నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం అరకొరగా వస్తున్న ఆదాయాన్ని ఆలయ విద్యుత్ నిర్వహణకు, దూప, దీప, నైవేద్యానికి, ఉత్సవాలకు, అర్చకుల జీతభత్యాల కోసం విని యోగిస్తున్నట్లు తెలుస్తోంది. రాధాకాంతుని ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడడంతో పాటు ఆదాయ వనరులు పెంచడంపై అధికారులు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

ఆదాయం పెంచేందుకు కృషి

రాధాకాంతుని ఆలయ ఆదాయం పెంచేందుకు కృషి చేస్తున్నాం. నర్సింగపల్లి పంచాయతీ పరిధిలోని ఆలయ భూముల నుంచి లీజులు రావడం లేదు. దీనిపై ఆ ప్రాంత రైతులకు రెవెన్యూ సదస్సుల్లో అవగాహన కల్పించాం. లీజులు చెల్లించే రైతులకు ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం, పంట నష్టపరిహారం వంటి రాయితీలు లభిస్తాయి. ఉన్న వనరులతో పాటు దాతల సహకారంతో ఆలయం నడిపిస్తున్నాం.

- టి.మనస్విని, రాధాకాంతుని ఆలయ ఈవో

న్యూస్ బాక్స్

కులగణనపై 12 వరకు అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణనపై ఈ నెల 12 వరకూ అభ్యంతరాలు స్వీకరించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాల స్వీకరణ గడువును ప్రభుత్వం ఈ నెల 7 నుంచి 12 వరకూ పెంచిందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన అభ్యంతరాలను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. 20న తుది కులగణన సర్వే వివరాలు గ్రామ/వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తామన్నారు. మండల ప్రత్యేకాధికారులు ఈ ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు.

కిడ్నీ వ్యాధితో కళాకారుడి మృతి

పలాస రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన కళాకారుడు గేదెల అప్పారావు(62) కిడ్నీవ్యాధితో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. బొడ్డపాడులో ఆయన యువజన సంఘం స్థాపించి.. అనేక సేవా కార్యక్రమాలను కొనసాగించారు. రెండేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ.. మృతి చెందడంతో ఈ ప్రాంతవాసులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఉద్దానం ప్రాంతంలో ఇటీవల అధిక సంఖ్యలో కిడ్నీవ్యాధి బాధితులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి కిడ్నీవ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



అప్పారావు (ఫైల్)

నిధుల్లేక.. నిస్తేజంగా!

- అలంకారప్రాయంగా మార్కెట్ కమిటీలు
- నిరుపయోగంగా గోదాములు, కల్లాలు
- వైసీపీ ప్రభుత్వ హయాంలో అందని సేవలు
- కూటమి ప్రభుత్వంపైనే రైతుల ఆశలు



నరసన్నపేట మార్కెట్ కమిటీలో నిరుపయోగంగా ఉన్న కల్లాలు

నరసన్నపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి)

రైతులకు సేవలు అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన మార్కెట్ కమిటీలు నిస్తేజంగా మారాయి. జిల్లాలోని 12 మార్కెట్ కమిటీల్లో పలు గోదాములు, కల్లాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిద్వారా రైతులకు సక్రమంగా సేవలు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో నరసన్నపేట, శ్రీకాకుళం, పొందూరు, జలుమూరు, ఆమదాలవలస, కోటబొమ్మాళి, పాతపట్నం, కంచిలి, పలాస, పాతపట్నం, హిరమండలం, ఎచ్చెర్లలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఒక్కో మార్కెట్ కమిటీలో 3వేల మెట్రిక్ టన్నులు ధాన్యం భద్రపరిచేందుకు వీలుగా గోదాములు ఉన్నాయి. అలాగే రైతులు ధాన్యం ఆరబెట్టేందుకుగానూ రెండు, మూడేసి చొప్పున పెద్దపెద్ద కల్లాలు నిర్మించారు. కాగా.. వైసీపీ పాలనలో గత ఐదేళ్లూ నిధులు కేటాయించక పోవడంతో మార్కెట్ కమిటీల అభివృద్ధి కనుమరుగైంది. వైసీపీ నాయకులకు మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్ల పదవులు తప్ప.. రైతులకు సేవలు మాత్రం సక్రమంగా అందలేదు. మార్కెట్ కమిటీల్లో కోట్లాది రూపాయలతో నిర్మించిన గిడ్డంగులు వృథాగా పడి శిథిలావస్థకు చేరుకున్నాయి.

● అసాంఘిక కార్యకలాపాలు..

జిల్లాలో కొన్ని మార్కెట్ కమిటీ కార్యాలయాలు.. రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. నరసన్నపేట మార్కెట్ యార్డులో ప్రహరీ కూల్చేశారు. రాత్రివేళ గంజాయి బ్యాచ్, మందుబాబులు ఇక్కడ మకాం వేస్తున్నారు. ఇదే ప్రాంతంలో వేరే హౌసింగ్ గోదాములు ఉన్నాయి. మందుబాబుల కారణంగా ఏదైనా ప్రమాదం జరిగితే రూ.కోట్లలో నష్టం జరిగే అవకాశం ఉంది. అలాగే నరసన్నపేట మార్కెట్ కమిటీ పరిధిలో కోట్లాది రూపాయలతో గోదాములు, కల్లాలు నిర్మించారు. గోదాములు కొన్నాళ్లపాటు ఎరువులు, విత్తనాలు నిల్వ చేసేందుకు వినియోగించారు. నాలుగేళ్లుగా గోదాములు, కల్లాలు వినియోగించక పోవడంతో రాత్రివేళల్లో పశువులకు నిలయంగా మారాయి. గొర్రెలు పెంపకం దారులు వీటిని ఆవాసాలుగా ఏర్పాటు చేసుకున్నారు.



నరసన్నపేట మార్కెట్ కమిటీ కార్యాలయం

● సిబ్బంది తీరుపై ఆరోపణలు..

మార్కెట్ కమిటీ సిబ్బంది.. మార్కెట్ సెస్ మీద మాత్రమే దృష్టి సారిస్తున్నారు. నరసన్నపేట మండలంలో మడపాం కేంద్రం వద్ద వాహనాలను తనిఖీ చేసి అక్రమంగా వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే మాదిరిగా టమాట, చెరుకు, అరటి, కూరగాయాలు, పశువులు రవాణా చేసే వాహనాల నుండి వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే కొన్ని గోదాములను ప్రైవేటు వ్యక్తులకు అద్దెకు ఇచ్చి సిబ్బంది చేతివాటం చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అమలు కాని రైతుబంధు పథకం..

టీడీపీ ప్రభుత్వ హయాంలో(2014-19 మధ్య) రైతు బంధు పథకాన్ని అమలు చేశారు. ఈ పథకం ద్వారా.. రైతులు పండించిన పంటలను మార్కెట్ కమిటీలోని గోదాముల్లో నిల్వ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. నిల్వ చేసిన పంటలపై మార్కెట్ కమిటీలు రైతులకు 60 శాతం వరకూ నామమాత్రపు వడ్డీతో రుణాలు అందజేసేవారు. మార్కెట్‌లో మద్దతు ధర ఎక్కువగా ఉన్నప్పుడు రైతులు ఆ పంటను విక్రయించుకుని.. రుణాలు తీర్చేవారు. అలాగే మార్కెట్ కమిటీ పరిధిలో వైద్య, పశు వైద్యశిబిరాలు కూడా నిర్వహించేవారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు పథకాన్ని నిలిపేశారు. గత ఐదేళ్లూ వైద్యశిబిరాల నిర్వహణ కూడా చేపట్టలేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల వరుస తుఫాన్‌లతో.. పంటలను కాపాడుకునేందుకు నానా పాట్లు పడ్డారు. మార్కెట్ కమిటీలో గోదాములు, కళ్లాలు (మిగతా 6వ పేజీలో...)



శ్రీకాకుళంలో వాకింగ్ చేస్తున్న ప్రజలు

నడకే దివ్యౌషధం

- ఆరోగ్యానికి మేలు చేస్తుందంటున్న వైద్యులు
- ఒత్తిడిని అధిగమించేందుకు వజ్రాయుధం

6 లో



జగన్నాథపురం తంపరలో వెలిసిన రొయ్యల చెరువులు

రొయ్యల అక్రమ చెరువులకు అడ్డుకట్ట

- తొలగించేందుకు రంగం సిద్ధం

6 లో

సంక్రాంతి కళ వచ్చేసింది

- పల్లెల్లో మొదలైన సందడి
- హరిదాసులు, జంగమ దేవరలతో హడావుడి



6 లో

సంక్రాంతి కళ వచ్చేసింది

- పల్లెల్లో మొదలైన సందడి
- హరిదాసులు, జంగమ దేవరల రాక
- స్వగ్రామాలకు చేరుకుంటున్న జనం

టెక్కలి/నరసన్నపేట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో సంక్రాంతి సందడి మొదలైంది. ఉపాధి కోసం వలస వెళ్లి.. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా సొంత ఊరి బాట పడుతున్నారు. ఎంత దూరంలో ఉన్న వారైనా సంక్రాంతికి పల్లెల్లో వాలిపోతుంటారు. ఈ క్రమంలోనే ఉద్యోగులు, వలస కూలీలు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. వచ్చీపోయే వారికి పలకరింపులతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. సున్నాలు... రంగులతో ఇళ్లను అలంకరించే పనిలో ప్రజలు నిమగ్నమయ్యారు. వాకిళ్ల గొబ్బెమ్మలు, ముత్యాల ముగ్గులతో వన్నెలీనుతున్నాయి. సాధారణంగా నెలగంటు పడిన మరుసటి రోజు నుంచే గ్రామాలకు పండుగ కళ వస్తుంది. ఈ ధనుర్మాసంలో పల్లెల్లో హరిదాసులు, డూడూ బసవన్నలు, సెంచులు, జంగమ దేవరులు ప్రత్యక్షమవుతారు. వీరిని గ్రామీణ ప్రజలు సాదరంగా ఆహ్వానించి బియ్యం, కూరగాయలతో కానుకలు ఇచ్చి గౌరవిస్తుంటారు.

శ్రీకృష్ణునికి మరో రూపంగా...

సంక్రాంతి సమయంలో ముందుగా మొదలయ్యేది హరిదాసుల సందడి. ధనుర్మాసంలో మాత్రమే వీరు కనిపిస్తారు. హరిదాసులను మహావిష్ణువుకు ప్రతిరూపాలుగా గ్రామీణులు భావిస్తారు. హరిదాసులు తెచ్చే అక్షయ పాత్రలో బియ్యాన్ని పోస్తే మనం తెలిసీ తెలియక చేసిన ఎన్నో పాపాలు తొలగిపోతాయని విశ్వాసం. వీరి పాటలు వింటూ గ్రామీణ ప్రాంత ప్రజలు మురిసిపోతారు.



టెక్కలి: చెంచు కళాకారుడు



టెక్కలి: పితృదేవతల స్మరణలో జంగమయ్యలు

సెంచుల సందడి..

సంక్రాంతి సమయంలో కనిపించే ముఖ్యమైన అతిథులు సెంచులు. తలపై నెమలి పింఛంతో పాగా, పిల్లన గ్రోవితో పాటలు పాడుతూ... మరో చేతితో జేగంటలు మోగిస్తూ.. భగవన్నామ స్మరణతో ధనుర్మాసంలో ఇంటింటికి వెళ్లి భిక్షాటన చేస్తుంటారు. వీరు పాడే జానపద గీతాలు ఆసక్తిగొల్పుతాయి.

డూడూ బసవన్నలు..

సంక్రాంతి సమయంలో కనిపించే ముఖ్యమైన అతిథుల్లో డూడూ బసవన్నలది ప్రత్యేక స్థానం. గంగిరెద్దుల వారికి ఈ సమయంలో కనిపించే ఆదరణను మాటల్లో చెప్పలేం. 'అయ్యవారికి దండం పెట్టూ... అమ్మవారికి దండం పెట్టూ' అంటూ ధనుర్మాసంలో డూడూ బసవన్నలు చేసే సందడిని వర్ణించలేం. సింహాద్రి అప్పన్న, డూడూ బసవన్న అంటూ గంగిరెద్దులతో వీరు చేయించే విన్యాసాల కోసం ఆబాలగోపాలం ఆసక్తితో ఎదురు చూస్తుంటారు.

పితృదేవతల కోసం జంగమ దేవరులు..

సంక్రాంతి అంటే పితృదేవతలను కొలిచే పండుగని గ్రామీణ ప్రాంత ప్రజల నమ్మకం. అందుకే వివిధ రూపాల్లో పితృ దేవతలను కొలుస్తారు. నుదుట శివనామం... ఓ చేతిలో గంటతో... శివనామస్మరణతో జంగమ దేవరులు పితృదేవతలను సంతృప్తి ప రిచే గీతాలతో ఇంటింటికీ తిరుగుతారు. తమ ఇళ్లలో చనిపోయిన వారి పేరిట సంబంధిత కుటుంబ సభ్యులు జంగమ దేవరలకు దానధర్మాలు చేస్తారు. వీరికి బియ్యం, కాయగూరలు, దక్షిణలు ఇస్తారు. పేద, ధనిక తేడా లేకుండా అందరూ వీరికి పితృదేవతల పేరిట దానం చేస్తారు.





నరసన్నపేట: ఓ ఇంటి వద్ద జంగమయ్య

ఉత్సాహంగా.. 'మేలుకొలుపు'

నరసన్నపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ధన్మురాస ఉత్సవాల్లో బాగంగా అడవినారాయణవలస భజన బృంద సభ్యులు మంగళవారం పట్టణ వీధుల్లో మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించారు. జీసీ హోం, కోవెల వీధి, నేతాజీ వీధి, ఉణ్న వారి వీధి, గాంధీనగర్‌లలో భజనలు చేశారు. మేలుకొలుపు కార్యక్రమం తెలుగు సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందని కాళింగ కారొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, భజన బృందం ఆర్గనైజర్ శిమ్మ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



మేలుకొలుపులో పాల్గొన్న భజన బృంద సభ్యులు

సంక్రాంతికి గ్రామానికి చేరుకుంటాం..



ఉద్యోగ రీత్యా ఎక్కడ ఉన్నా.. సంక్రాంతికి సొంత ఊరికి చేరుకుంటాం. గ్రామాల్లో చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం తీయని అనుభూతి. సంక్రాంతి మధుర జ్ఞాపకాలను ఏడాది పాటు నెమరు వేసుకుంటాం ఎప్పుడు సంక్రాంతి వస్తుందా.. సొంత ఊరికి వెళదామా అని ఎదురు చూస్తుంటాం.

-సాధు శిబిచక్రవర్తి, ఐఏఎస్, అసోం కేడర్, జమ్ము

గ్రామాల్లో సందడి వేరు..



గ్రామాల్లో సంక్రాంతి సందడి వేరు. ఇంటి నిండా బంధువులు. అందరికీ ఇష్టమైన పిండివంటలు చేయడం... ఆడపిల్లలు గొబ్బెమ్మలు, ముగ్గులతో అలంకరించడంతో సరదాగా ఉంటుంది. పెద్ద పండుగ ఎప్పుడు వస్తుందా? పిల్లలు ఎప్పుడెప్పుడు వస్తారా? అని ఎదురు చూస్తాం.

-నేతింటి భారతి, బైరేగివీధి, నరసన్నపేట

తెలుగు సంప్రదాయానికి ప్రతీక..



తెలుగు ప్రజలు ఘనంగా నిర్వహించే పండుగ సంక్రాంతి. పూర్వీకులను పూజించడం.. గ్రామాల్లో రైతులు పంటలు ఇంటికి రావడంతో ఎంతో ఆనందంగా పండుగను జరుపుకుంటారు. పిల్లల ఆటలు, పెద్దలు పలకరింపులతో ఈ వారం రోజులు సంతోషంగా గడచిపోతాయి.

-మావుడూరి జగదీష్‌బాబు, పురోహితులు, సత్యవరం

నడకే దివ్యౌషధం



- ఆరోగ్యానికి మేలు చేస్తుందంటున్న వైద్యులు
- ఒత్తిడిని అధిగమించేందుకు వజ్రాయుధం

గుజరాతీపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నడక మనిషి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అందుకే ప్రతి రోజు 30 నుంచి 60 నిమిషాల పాటు నడవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆహార అలవాట్లు.. జీవన శైలి మార్పులతో చిన్న వయస్సు నుంచే ఊబకాయం... అధిక రక్తపోటు, షుగర్‌తో పాటు కొత్త కొత్త వ్యాధులకు శరీరం నిలయంగా మారుతోంది. ఆరోగ్యాన్ని ఛిన్నాభిన్నం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఒత్తిడిని అధిగమించేందుకు... జీవన శైలి వ్యాధుల నుంచి కాపాడుకునేందుకు నడక ఒక్కటే సరైన మార్గమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దీంతో నడకకు ప్రాధాన్యం పెరుగుతోంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు మైదానం బాట పడుతున్నారు. వేకువ జాము నుంచే నగరంలోని ఏ రోడ్డు చూసినా వాకర్లు కనిపిస్తుంటారు. నగరానికి చుట్టు పక్కల ఉన్న 80 అడుగుల రోడ్డు, అరసవల్లి నుంచి వప్పంగి వెళ్లే రోడ్డు, సింహద్వారం, కొత్త రోడ్డు, పెద్దపాడు రహదారులు వాకర్లతో నిండిపోతున్నాయి. జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియం, ఆర్ట్స్ కళాశాల మైదానం, పీఎస్ఎన్ఎం స్కూలు, ఏడు రోడ్ల జంక్షన్‌లో గల ఎన్టీఆర్ మున్సిపల్ మైదానాలలో నడవడంతో పాటు వివిధ క్రీడలనూ సాధన చేస్తున్నారు. తద్వారా శారీరక, మానసిక ఉల్లాసాన్ని పొందుతున్నారు.



వ్యాయామం ఇలా..

● ఏరోబిక్స్‌పై ఆసక్తి..

కొందరు నడకతో సరిపెడుతుంటే... మరికొందరు ఏరోబిక్స్, డ్యాన్సులపై ఆసక్తి చూపుతున్నారు. ఆర్ట్స్ కళాశాల, పీఎస్ఎన్ఎం స్కూలు, 80 అడుగుల రోడ్డులలో మ్యూజికల్ సౌండ్ సిస్టమ్ ద్వారా ఏర్పాటు చేస్తున్న జింబో డ్యాన్స్‌లకు ఆసక్తి కనబరుస్తున్నారు. మరి కొందరు ఏరోబిక్స్ చేస్తున్నారు. జుంబా డ్యాన్స్ పట్ల అధిక శాతం మహిళలు ఆసక్తి కనబరుస్తుండడం గమనార్హం. ఇక యువత, నడి వయస్కులు అధికశాతం జిమ్‌ల బాట పడుతున్నారు.

రోజంతా ఉల్లాసం..



ఉదయాన్నే మైదానానికి వస్తే రోజంతా ఉల్లాసంగా ఉంటుంది. నడక ద్వారా మానసికంగా ఎంతో ఆనందం కలుగుతోంది. అందుకే క్రమం తప్పకుండా ఆర్ట్స్ కళాశాలలోని మైదానానికి వెళుతుంటా. గంట సమయం వ్యాయామానికి కేటాయిస్తుంటాను.

-టి.ఖగేంద్రనాథ్, న్యాయవాది

ఒత్తిడి దూరం..



వేకువ జామున మైదానంలో వాకింగ్ చేస్తుంటే సహజ సిద్ధమైన, స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుంది. తద్వారా శరీరంలో అన్ని అవయవాలు బాగా పని చేస్తాయి. ఉదయాన్నే మైదానానికి వెళితే... రోజంతా ఎన్ని ఒత్తిడులు ఉన్నా... సునాయాసంగా అధిగమించగలుగుతున్నాను.

-ఎన్ని సూర్యారావు, సంఘ సేవకుడు

రొయ్యల అక్రమ చెరువులకు అడ్డుకట్ట

- తొలగించేందుకు రంగం సిద్ధం
- ఇప్పటికే విద్యుత్ సరఫరాకు బ్రేక్



తంపర భూములపై సమీక్షిస్తున్న టెక్కలి ఆర్డీవో (ఫైల్)

సంతబొమ్మాళి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురం, ఎస్.బి.కొత్తూరు, ఉమిలాడ గ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా రొయ్యల చెరువులు సాగుచేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపేందుకు రెవెన్యూ అధికారులు సమాయత్తం అవుతున్నారు. జగన్నాథపురంలోని సర్వే నెంబర్ 315 లో తంపరలో 300 ఎకరాల ప్రభుత్వ భూములను జగన్నాథపురం, రుంకు, ఉదయపురం గ్రామస్తులు ఆక్రమించి... అక్రమంగా రొయ్యల సాగు చేస్తున్నారు. ఎస్‌బీ కొత్తూరు, ఉమిలాడలో మరో వంద ఏకరాల ప్రభుత్వ భూముల్లో అక్రమ రొయ్యల సాగు నడుస్తోంది. గతంలో జగన్నాథపురం తంపర 315 సర్వే నెంబరులో రెవెన్యూ అధికారులు కొన్ని చెరువులకు గట్లు తొలగించి... ప్రభుత్వ భూమి అని బోర్డులు ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల తర్వాత యధావిధిగా ఆక్రమణదారులు రొయ్యల సాగును ప్రారంభించారు. అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు పొందారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూముల్లో సాగువుతున్న రొయ్యల చెరువులకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వరు. అప్పట్లో పనిచేసిన విద్యుత్ అధికారులు కాసులకు కక్కుర్తి పడి... జిరాయితీ భూముల సర్వే నెంబర్లు చూపించి... ప్రభుత్వ భూములకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశారని ఆరోపణలు వినిపించాయి. దీనిపై ప్రస్తుత టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి ప్రభుత్వ భూముల్లో అక్రమంగా సాగవుతున్న రొయ్యల చెరువులకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయాలని ఆదేశించారు. దీంతో జగన్నాథపురం తంపరలో ఇటీవల విద్యుత్ కనెక్షన్లు తొలగించారు. ఎస్‌బీ కొత్తూరు ప్రాంతంలో ఇంకా రొయ్యల అక్రమ సాగుకు విద్యుత్ సరఫరా అవుతుండడంతో అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. వెంటనే వాటిని తొలగించాలని ఆర్డీవో విద్యుత్ శాఖ అధికారులను సోమవారం ఆదేశించారు. త్వరలోనే రెవెన్యూ. మత్స్య, విద్యుత్ శాఖాధికారులు సంయుక్తంగా సర్వే చేసి... తంపరలో ఆక్రమణలు తొలగించేందుకు టెక్కలి ఆర్డీవో ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనికి కావలసిన బడ్జెట్ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించారు. నిధులు వచ్చిన వెంటనే ఆక్రమణల తొలగింపునకు రెవెన్యూ అధికారులు సన్నద్ధమవుతున్నారు.

పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉపాధి..

జగన్నాథపురం తంపరలోని 315 సర్వే నెంబరులో 300 ఎకరాలల ప్రభుత్వ భూమి ఉంది. దీనికి తోడు పక్కనే అటవీ శాఖ భూములు ఉన్నాయి. వీటిని కొందరు ఆక్రమించుకొని యథేచ్ఛగా రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారు. దీని వల్ల పక్కనే ఉన్న పొలాలకు ఉప్పు నీరు చేరిపోయి పంటలు దెబ్బ తింటున్నాయి. ఈ తంపర భూముల్లో చిన్నపాటి పరిశ్రమలు ఏర్పాటు చేస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి కలగడమే కాకుండా, ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ఇక్కడికి జాతీయ రహదారి కేవలం 14 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఇక్కడి నుంచి కోటబొమ్మాళి రైల్వేస్టేషన్, 6 కిలోమీటర్లు... హర్శిశ్చంద్రపురం రైల్వేస్టేషన్ కిలోమీటర్లు దూరంలోనే ఉన్నాయి. ఇక్కడ ఏదైనా పరిశ్రమ ఏర్పాటు చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కొల్లివలస సంత కిటకిట

బూర్జ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అనేక చోట్ల ఇప్పటికీ సంతలే పెద్ద మార్కెట్లు. సంక్రాంతికి కావలసిన కొత్త కుండలు, ఇతర సామగ్రిని సంతల్లోనే కొనుగోలు చేస్తుంటారు. ఇక కోళ్లు, మేకలు, పొట్టేళ్లనూ వీటిలోనే కొనడం ఆనవాయితీ. కొల్లివలస వారపు సంతలో మంగళవారం నాటు కోళ్లు, మేకలతో పాటు కాసులు కురిపించే పొట్టేళ్ల సందడి చేశాయి. అటు రైతులు, ఇటు వ్యాపారులు పెద్ద ఎత్తున రావడంతో సంత ప్రాంగణం కోలాహలంగా మారింది. కొల్లివలసలసతో పాటు బూర్జ, సరుబుజ్జిలి, పాలకొండ, ఆమదాలవలస ప్రాంతాల్లోని గొర్రెల పెంపకందారులు పొట్టేళ్లను, నాటుకోళ్లను సంతకు తెచ్చారు. ఒక్కో పొట్టేలు ధర రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు పలికింది. నాటుకోడి ధర రూ.600 నుంచి రూ.1200 వరకు ఉంది.



కొల్లివలస సంతలో పొట్టేళ్లతో విక్రయదారులు

నిధుల్లేక.. నిస్తేజంగా!

(ఐదో పేజీ తరువాయి)

వినియోగించకుండా ఆరుబయట ధాన్యం ఉంచేయడంతో కొంతమేర నష్టపోయారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా.. మార్కెట్ కమిటీల బలోపేతానికి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి..

టీడీపీ ప్రభుత్వ హయాంలో మాదిరి రైతుబంధు వంటి పథకాలను అమలు చేయాలి. విపత్తుల సమయంలో రైతులు పండించే పంటలను నిల్వ చేసి ఆరబెట్టేందుకు వీలుగా ఉన్న ప్లాట్‌ఫాంను వినియోగంలోకి తీసుకురావాలి. రైతులకు మెరుగైన సేవలు అందించాలి.

-కృష్ణ, రైతు చిన్నదూగాం

మెరుగైన సేవలు అందిస్తాం..

జిల్లాలోని 12 మార్కెట్ కమిటీల్లో ఒక్క హిరమండలం తప్ప. మిగతా వాటికి సొంత భవనాలు ఉన్నాయి. వీటిలో కొన్నింటికి గోదాంలు, కళ్లాలు ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్ కమిటీలను క్రియాశీలకంగా తయారు చేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రైతులకు మెరుగైన సేవలు అందిస్తాం.

-బి.రవికిరణ్, ఏడీ, మార్కెట్ కమిటీ

దేహదారుఢ్య పరీక్షల్లో 232 మంది అర్హత

- ఎస్పీ పర్యవేక్షణ

ఎచ్చెర్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల సాయుధ పోలీసు మైదానంలో కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియలో భాగంగా మంగళవారం నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షల్లో 232 మంది అర్హత సాధించారు. మొత్తం 600 మంది హాజరు కావలసి ఉండగా.. 364 మంది హాజరయ్యారు. వీరిలో 232 మంది అర్హత సాధించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో ఈ ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది.

దేహదారుఢ్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎస్పీ





గ్రిగ్స్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎన్ఈఆర్

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

● ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. మంగళవారం రణస్థలం జడ్పీ హైస్కూల్‌లో 77వ అంతర పాఠశాల జోనల్ గ్రిగ్స్ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి, శరీరదారుఢ్యానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో డీఈవో తిరుమలచైతన్య, ప్రధానోపాధ్యాయుడు బి.రమణయ్య, కూటమి నేతలు డీజీఎం ఆనందరావు, గొర్లె లక్ష్మణరావు, రౌతు శ్రీనివాసరావు, నారాయణశెట్టి శ్రీను, దన్నాన చిరంజీవి పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

● ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం- ఆమదాలవలస ప్రధాన రహదారి పనులను సంక్రాంతికి పూర్తి చేయాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశించారు. మంగళవారం రాగులు-వాకలవలస వద్ద జరుగుతున్న పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ అర్అండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడారు. గతప్రభుత్వం హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఈ రహదారినివేగవంతంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. వైసీపీ పాలనలో రహదారిలో గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరిగి ఎంతోమంది మృత్యువాతపడిన సంఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. సీఎం చంద్రబాబు,మంత్రులు నారా లోకేష్ బీసీ జనార్దనరెడ్డి రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహకరించారని తెలిపారు.



ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్న కూన రవికుమార్



నాయకులతో మాట్లాడుతున్న అశోక్

మోదీ సభను విజయవంతం చేయండి

● ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్

కవిటి, జనవరి 7(ఆంధ్రజ్యోతి):విశాఖలో బుధవారం నిర్వహించే ప్రధాని నరేంద్ర మోదీ సభకు నియోజకవర్గం నాలుగు మండలాలతోపాటు మునిసిపాలిటీకి చెందిన టీడీపీ, కూటమి నాయకులు హాజరై విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ పిలుపు నిచ్చారు. మంగళవారం కవిటి మండలంలోని రామయ్యపుట్టుగలో గల టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలో గల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సభకు భారీగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే ధ్యేయమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలోని విశాఖ-ఏ కాలనీలో గల తన కార్యాలయంలో గ్రీవెన్స్‌కు నిర్వహించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామాల్లో కనీస సదుపాయాలకు కూడా ప్రజలు నోచుకోలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం పల్లె పండుగ, గ్రామసభలు నిర్వహించి గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతోందని తెలిపారు. వైసీపీ హయాంలో ఛిన్నాభిన్నమైన వ్యవస్థలను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. రైతులకు ధాన్యం అమ్మిన 24 గంటల్లోగా వారి అకౌంట్లలో నగదును జమ చేస్తున్నామన్నారు.



వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి):మండలంలోని హరిపురం, తేలుకుంచి, మశాఖపురం, మునిసిపాలిటీ పరిధిలో గల రత్తకన్న 18, 19, 20 వార్డుల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పలాస ట్రాన్స్‌కో ఈఈ విఘ్నేశ్వరరావు ఒకప్రకటనలో తెలిపారు. నిర్వహణ పనుల నిమిత్తం బుధవారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నేటి కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్ష వాయిదా

శ్రీకాకుళం క్రైం, జనవరి7 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో బుధవారం జరగాల్సిన కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షను ఈ నెల 11కు వాయిదా వేసినట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం వైకుంఠ ఏకాదశి, ఇతర శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా పరీక్షను వాయిదా వేసినట్లు చెప్పారు. మిగిలిన తేదీల్లో జరగాల్సిన దేహదారుఢ్య పరీక్షలు యథావిధిగా జరుగుతాయని, ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలని అన్నారు.

10, 11 తేదీల్లో సంక్రాంతి సంబరాలు

ఆమదాలవలస, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 21వ వార్డు పరిధిలోని రావికంటిపేటలో ఈనెల 10, 11 తేదీల్లో జగనన్న సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నట్లు వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. వివరాలకు 99635 39264, 9640992916 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

12న ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీలు

కంచిలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఈనెల 12న పెద్దకొజ్జిరియా గ్రామంలో ఉత్తరాంధ్రస్థాయి క్విజ్‌పోటీలు నిర్వహించనున్నట్లు వివేకానంద యువజన సంఘ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు జ్ఞాపికలతోపాటు నగదు పారితోషికం అందజేయనున్నట్లు చెప్పారు. ప్రతి జట్టులో నలుగురు సభ్యులు ఉండాలని, ప్రవేశ రుసుం లేదని తెలిపారు. మరిన్ని వివరాలకు 9010902091, 98665 81937, 9010303454 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సంఘాల బలోపేతానికి కృషి చేయాలి: ఏపీఎం

ఇచ్ఛాపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంఘాలు బలోపేతానికి కృషి చేయాలని ఏపీఎం ప్రసాద్ కోరారు. మంగళవారం ఇచ్ఛాపురంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య ఈసీలు, సీసీలకు కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ పాలన, నాయకత్వంపై శిక్షణ నిర్వహించారు.



మాట్లాడుతున్న ప్రసాద్

బాధితులకు పునరావాసం కల్పించాలి

ఆమదాలవలస, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నజొన్నవలసలో కోర్టు ఆదేశాల మేరకు ఇళ్లు తొలగించిన నిర్వాసితులకు తక్షణమే పునరావాసం కల్పించాలని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం డిమాండ్ చేశారు.మంగళవారం చిన్నజొన్నవలసలో బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధితులకు తక్షణమే ఇళ్ల సలాలు మంజూరు చేసి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తమ్మినేని డిమాండ్ చేశారు.

సీనరేజ్ తగ్గించి ఆన్‌లైన్‌లో బిల్లులు ఇవ్వండి



ఆందోళన చేస్తున్న లారీ యజమానులు

ఎచ్చెర్ల, జనవరి 7(ఆంధ్రజ్యోతి):అధికారులు సీనరేజ్ తగ్గించి, ఆన్‌లైన్‌లో బిల్లులు ఇవ్వాలని లారీ యజమానులు డిమాండ్ చేశారు. మంగళవారం చిలకపాలెం గ్రామానికి సమీపంలో అన్నంపేట వద్ద చిలకపాలెం, నందివాడ, లోలుగు, నర్సాపురం, కంచరాం తదితర గ్రామాల లారీ యజమానులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చిలకపాలెం పరిసర గ్రామాల్లో అనుమతులు ఉన్న పలు క్వారీల నుంచి గ్రావెల్, మట్టిలారీల ద్వారా వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గ్రావెల్‌ను తరలిస్తుండగా ఓ ప్రైవేటు ఏజెన్సీ వారు సీనరేజ్ వసూలు చేస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా ఇటువంటి వసూళ్ల వల్ల తమతో పాటు వినియోగదారులకు కూడా ఆర్థికంగా భారమవుతుందని లారీ డ్రైవర్లు వాపోయారు.

డివైడర్ మధ్యలో చెట్ల తొలగింపు

శ్రీకాకుళం అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో మూడురోజుల పాటు నిర్వహించనున్న రథసప్తమి నాటికి నగరాన్ని గ్రీనరీ సిక్కోలుగా మార్చేందుకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో డివైడర్ మధ్యలో ఉన్న చెట్లను తొలగించి ఫాస్టేల్ మొక్కలను ఏర్పాటు చేసేందుకు కమిషనర్ పీవీవీ ప్రసాదరావు రంగం సిద్ధంచేశారు. నగరంలోని ఏడురోడ్ల కూడలి నుంచి డేఅండ్ నైట్, మిల్లు జంక్షన్ నుంచి ఉమెన్స్ కళాశాల రోడ్డు, కిమ్స్ రోడ్డులో డివైడర్ మధ్యలో ఉన్న చెట్లను తొలగించే పనులు మంగళవారం ప్రారంభించారు.ప్రస్తుతం డివైడర్ మధ్యలో ఉన్న చెట్లను వేర్లతో పాటు తొలగించి మరో చోటికి తరలించనున్నారు.వాటిస్థానంలో నగరానికి అందాన్ని తీసుకొచ్చే ఫాస్టేల్ మొక్కలను ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ ప్రసాదరావు తెలిపారు.



పాలకొండ రోడ్డులో చెట్టు తొలగిస్తున్న దృశ్యం

అదుపులోకి రాని డయేరియా

● పొందూరు సీహెచ్‌సీలో మరో ఐదుగురి చేరిక

పొందూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పొందూరు ఖస్సావీధిలో డయేరియా అదుపులోకి రాలేదు. మంగళవారం మరో ఐదుగురు స్థానిక సీహెచ్‌సీలో చేరారు. ఇప్పటి వరకూ 20 మంది డయేరియా బారిన పడ్డారు. వీధుల్లో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. తాడివలస పీహెచ్‌సీ వైద్యుడు రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సిబ్బంది రోగులకు ఇంటివద్ద చికిత్సలు చేశారు. ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఎంపీడీవో మన్మథరావు, టీడీపీ మండలాధ్యక్షులు సీహెచ్ రామ్మోహన్, సర్పంచ్ ఆర్.లక్ష్మి పరామర్శించారు.

తాగునీటి వనరులు కలుషితం కాలేదు

డయేరియా రోగులు, కుటుంబాలను జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య మంగళవారం పరామర్శించి, వీధుల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. తాగునీటి వనరులు కలుషితం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజు డీపీవోకు తెలియజేశారు. లాబ్‌లో నిర్వహించి నీటి పరీక్షల వివరాలను డీపీవోకు అందజేశారు.వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవడమే వ్యాధి తీవ్రతకు కారణమని డీపీవో గుర్తించారు. నాలుగు రోజులపాటు ట్యాంకర్ల ద్వారా తాగు నీరందించాలని ఈవో మోహన్‌బాబును ఆదేశించారు. వ్యాధి తీవ్రతపై వైద్యులతో డీపీవో చర్చించారు. పొందూరులో మాంసం, చేపలు విక్రయాలను పంచాయతీ అధికారులు నిషేధించారు. నాలుగురోజులపాటు ఎటువంటి విక్రయాలు లేకుండాచర్యలు తీసుకోవాలని డీపీవో భారతిసౌజన్య సూచించారు. సంక్రాంతి సమీపిస్తుండడంతో వ్యాధిని పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వ్యాధి పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరాలు నిర్వహించాలని వైద్యులకు సూచించారు. ఆమెతో పాటు డీఎల్‌పీవో ఐవీ రమణ, ఎంపీడీవో మన్మథరావు, ఏవో మిశ్రా, సర్పంచ్ ఆర్.లక్ష్మి తదితరులు ఉన్నారు.



పొందూరులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అధికారులు

సంక్రాంతి సందర్భంగా

చర్లపల్లి టర్మినల్ నుంచి ప్రత్యేక రైళ్లు

ప్రయాణ తేదీ	ట్రెయిన్ నంబరు	ఫ్రమ్ - టు	బయలుదేరు సమయం	చేరుకొనే సమయం
జనవరి 8, 11, 15	02764	చర్లపల్లి - తిరుపతి	18-55	మరుసటి రోజు 07-15
జనవరి 9, 11, 15	02763	తిరుపతి - చర్లపల్లి	16-55	మరుసటి రోజు 06-00
జనవరి 13	07037	వికారాబాద్- కాకినాడ టౌన్	19-40	మరుసటి రోజు 08-30
జనవరి 14	07038	కాకినాడ టౌన్- చర్లపల్లి	20-30	మరుసటి రోజు 08-30
జనవరి 9, 16	07655	కాచిగూడ- తిరుపతి	17-30	మరుసటి రోజు 07-30
జనవరి 10, 17	07656	తిరుపతి- కాచిగూడ	20-05	మరుసటి రోజు 09-30
జనవరి 11, 18	07035	చర్లపల్లి- నర్సాపూర్	19-15	మరుసటి రోజు 05-50
జనవరి 12, 19	07036	నర్సాపూర్- చర్లపల్లి	20-00	మరుసటి రోజు 08-00
జనవరి 12, 19	07078	సికింద్రాబాద్- కాకినాడ టౌన్	10-05	అదేరోజు 19-30
జనవరి 12, 19	07079	కాకినాడ టౌన్- సికింద్రాబాద్	22-00	మరుసటి రోజు 08-30
జనవరి 9, 13, 15, 17	07033	చర్లపల్లి- నర్సాపూర్	19-30	మరుసటి రోజు 05-50
జనవరి10, 14, 16, 18	07034	నర్సాపూర్- చర్లపల్లి	20-00	మరుసటి రోజు 08-00
జనవరి 8, 10, 12, 14	07031	చర్లపల్లి- కాకినాడ టౌన్	21-45	మరుసటి రోజు 08-30
జనవరి 9, 11, 13, 15	07032	కాకినాడ టౌన్- చర్లపల్లి	20-30	మరుసటి రోజు 08-35
జనవరి 6, 13	07487	నాందేడ్- కాకినాడ టౌన్	14-25	మరుసటి రోజు 08-10
జనవరి 7, 14	07488	కాకినాడ టౌన్- నాందేడ్	18-30	మరుసటి రోజు 05-10
జనవరి 9, 12, 14	07025	చర్లపల్లి- శ్రీకాకుళం రోడ్	19-20	మరుసటి రోజు 09-00
జనవరి 10, 13, 15	07026	శ్రీకాకుళం రోడ్- చర్లపల్లి	14-45	మరుసటి రోజు 06-00
జనవరి 8	07042	శ్రీకాకుళం రోడ్- కాచిగూడ	14-45	మరుసటి రోజు 07-30

- కుషాయిగూడ, ఆంధ్రజ్యోతి

నాలుగు గ్రామాల్లో సభలు

గార, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీలో భాగంగా మంగళవారం శ్రీకూర్మం, వత్సవలస, బలరాంపురం, అంపోలులో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభల్లో ఎస్ఆర్పీ పున్నపు నాయుడు, ఏపీవో సీహెచ్ సంధ్యారాణి, డీఆర్‌పీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

ఆమదాలవలస, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):చేపేనపేట, నిమ్మతొర్లోడల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను డీపీఎం రేవతి సమక్షంలో నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు సందర్శించారు. కార్యక్రమంలో సిబ్బంది నక్క చిరంజీవి, తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్ పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తి చేయండి

సోంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తి చేసి, తాగు నీటి సమస్య తీర్చాలని మండల పరిషత్ సమావేశంలో సభ్యులు కోరారు. ఎంపీపీ నిమ్మన దాసు అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలాసపురం సర్పంచ్ తడక జోగారావు మాట్లాడుతూ తమ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు కేంద్రమంత్రి హాజరయ్యారని, ప్రోటోకాల్ ప్రకారం తనకు సమాచారం ఇవ్వాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, తహసీల్దార్అప్పలస్వామి, గణపతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా పారా అథ్లెటిక్స్ పోటీలు



నిర్వాహకులతో పారా అథ్లెటిక్స్ విజేతలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లాస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలు మంగళవారం ఉత్సాహంగా సాగాయి. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్‌లు ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొనగా అథ్లెటిక్స్‌లో జావలిన్‌త్రో, డిస్కస్‌త్రో, లాంగ్ జంప్, షాట్‌పుట్‌తోపాటు రన్నింగ్‌లో పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన 31 మంది క్రీడాకారులను ఈనెల 30న గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేసినట్లు స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ ఆఫ్ శ్రీకాకుళం అధ్యక్షుడు టి.రాము, ఎన్.గిరిధర్, కార్యదర్శి డి.అచ్యుతరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు ఖోఖో ఇండియా శిక్షకులు శ్రీనివాస్, ఎన్.రాజేష్ తదితరులు సహకరించారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలి

ఆమదాలవలస, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జనసేన నాయకులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్‌రావు కోరారు.ఈ మేరకు మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జనసేన నాయకులతో రవికుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గ్రామస్థాయి నుంచి ఉన్న జనసేన శ్రేణులకు నామినేటెడ్ పదవుల పంపకంలో తగిన గౌరవం దక్కేలా చూడాలని కోరారు. బుధవారం విశాఖపట్నంలో జరిగే ప్రధాన నరేంద్రమోదీ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి తరలివెళ్లే జనసేన కార్యకర్తల రవాణా సౌకర్యం కోసం కార్యకర్తలతో చర్చించారు.

విద్యార్థులకు సామాజిక బాధ్యత అవసరం

బూర్జ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక బాధ్యత కూడా అవసరమని స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దేవేందర్ తెలిపారు. సామాజిక బాధ్యతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేయించారు.

నాయకత్వ లక్షణాల పెంపుతో మెరుగైన ఫలితాలు

ఎచ్చెర్ల,జనవరి 7(ఆంధ్రజ్యోతి): నాయకత్వ లక్షణాల పెంపుతో మెరుగైన ఫలితాలుసాధించవచ్చని డీఈవో డాక్టర్ ఎస్. తిరుమల చైతన్య తెలిపారు. మంగళవారం చిలకపాలెంలో ఎంఈవోలు, హెచ్ ఎంలకు స్టూడెంట్ లీడర్ డెవలప్‌మెంటు ప్రోగ్రాం (ఎస్ఎల్‌డీపీ) శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బోధనా స్థాయి పెంపు, నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పరిజ్ఞానాన్ని జోడించి వినూత్న బోధనతో మరింత ప్రయోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు ఎస్.అమ్మినాయుడు, జిల్లా పరిశీలకుడు గోవిందరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిరుమలచైతన్య

సచివాలయ ఉద్యోగిపై వైసీపీ అనుచరుడి దాడి

ఆమదాలవలస, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధికారంలో లేకున్నా పాత సంస్కృతినే ఆ పార్టీకి చెందిన కొంతమంది కొనసాగిస్తున్నారు. ఆమదాలవలస మండలంలోని ఓసచివాలయ ఉద్యోగిపై వైసీపీకి చెందిన అనుచరుడు దాడికి పాల్పడ్డారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు.. ఆమదాలవలస మునిసిపాలిటీ పరిధిలోగల మెట్టక్కివలస-1 సచివాలయంలో వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీగా సూరపు ఆనందరావు విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం తన క్లస్టర్ పరిధిలోని ప్రతి ఇంటి సభ్యుల వివరాలను సేకరిస్తున్నాడు. ఓటీపీ ఆధారంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్ ప్రక్రియలో వచ్చిన సమాచారాన్ని జతచేయడానికి వివరాలుఇవ్వాలని పుట్టవీధికి చెందిన కొప్పాల ఈశ్వరరావు(రమేష్)ను ఆనందరావు కోరారు. రేషన్‌కార్డులో సమాచారం ఉన్నా.. ఇంటి వివరాలలో ఈశ్వరరావుకు సంబంధించిన సమాచారం లేదని.. ఓటీపీ సమాచారం ఇస్తేనే మ్యాపింగ్ చేస్తామని స్పష్టంచేశారు.ఈ నేపథ్యంలో ఈశ్వరరావు కోపోద్రిక్తుడై తన అనుచరులతో కలిసి సచివాలయానికి వచ్చి అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీగా సూరపు ఆనందరావుపై దాడిచేశాడు. కాలర్ పట్టుకుని దాడిచేయడంతో ఆనందరావు మెడ కింద గాయమైంది. దీంతో ఆనందరావు ఫిర్యాదుమేరకు ఈశ్వరరావుపై పోలీసులు కేసు నమోదుచేశారు. కాగా ఈశ్వరరావు వైసీపీ నియోజకవర్గ నాయకుడికి ప్రధాన అనుచరుడిలో ఒకడిగా చెలామణి అవుతున్నాడు.

ఎంఎస్‌పల్లిలో పీడీఎస్ బియ్యం స్వాధీనం

కంచిలి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కంచిలి మండలంలోని ఎంఎస్‌పల్లిలో 19 బ్యాగులతో తరలిస్తున్న 8.29 క్వింటాళ్ల ప్రజాపంపిణీ వ్యవస్థ(పీడీఎస్) బియ్యం విజిలెన్స్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం విజిలెన్స్ సీఐ సతీష్ ఆధ్వర్యంలో ఆటోలో అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం మేరకు తనిఖీచేశారు. ఈ మేరకు సీజ్‌చేసి 6ఏ కేసు నమోదు చేశామని సీఎస్‌డీటీ కూర్మారావు తెలిపారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెంచామని అధికారులు తెలిపారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం

- సచివాలయాల్లో కనిపించని సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మెళియాపుట్టి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది ఎప్పుడు విధులకు వస్తారో.. ఎక్కడికి వెళతారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ హాజరు బయోమెట్రిక్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాల్లో ప్రజలకు అందు బాటులో ఉండాలి. అయితే ఈ పరిస్థితి ఏ సచివాలయంలోనూ లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' గొప్పిలి సచివాలయాన్ని పరిశీలించగా మధ్యాహ్నం 12.30 గంటలకే సిబ్బంది కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. ఈ సమయంలో గ్రామానికి చెందిన ఊర్మిల పాత్రో.. ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింక్ కోసం వచ్చినా సిబ్బంది లేకపోవడంతో నిరాశగా వెనుదిరిగింది. ఇలాగే వివిధ పనులపై వచ్చినా సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. నిత్యం ఉదయం 10 గంటల తరువాత, సాయంత్రం 5 గంటల తరువాత సిబ్బంది వచ్చి బయోమెట్రిక్ వేసి వెళ్లిపోతున్నారని పలువురు వాపోతున్నారు. ఇదే పరిస్థితి పలు సచివాలయాల్లోనూ ఉందని పలువురు పేర్కొంటున్నారు. దీంతో లక్ష్యం నెరవేరడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో ప్రసాద్ పండాను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, లేకుంటే జీతాలు నిలుపుదల చేస్తామన్నారు. సచివాలయాలను తనిఖీ చేసి నిత్యం ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.


మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకే ఖాళీగా ఉన్న గొప్పిలి సచివాలయం

క్రైం కార్నర్

13 మంది టీడీపీ నేతలపై కేసు కొట్టివేత

టెక్కలి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ 2022లో టెక్కలి ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన టీడీపీ నేతలపై వైసీపీ ప్రభుత్వ ప్రోద్బలంతో అప్పటి ఎస్ఐ కామేశ్వరరావు పెట్టిన కేసును కొట్టివేశారు. ఈ మేరకు సదరు సాక్ష్యాధారాలు పరిశీలించిన పిమ్మట కేసును కొట్టివేస్తూ మంగళవారం జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజా చక్రవర్తి మల్లా తీర్పునిచ్చారు. సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల టీడీపీ అధ్యక్షులు బగాది శేషగిరి, బోయిన రమేష్, జీరు భీమారావు, మట్ట పురుషోత్తం, నేతలు మామిడి రాము, దల్లి ప్రసాదొరెడ్డి, మల్లా బాలకృష్ణ, పోలాకి చంద్రశేఖర్, రెయ్యి ప్రీతీష్, హనుమంతు రామకృష్ణ, గండేటి భీమారావు, కోళ్ల కామేసు, కోళ్ల లవకుమార్ మండల పరిషత్ సిబ్బందిని విధులకు వెళ్లకుండా అడ్డుకున్నారని, ఆటంకం కలిగించి దౌర్జన్యం చేశారని అప్పటి ఎంపీడీవో హనుమంతు రమణమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ నేతల తరఫున న్యాయవాది ప్రభుచంద్ర వాదనలు వినిపించారు. వాదోపవాదాలు విన్న న్యాయాధికారి కేసును కొట్టివేస్తూ తీర్పు ఇచ్చినట్లు సీఐ పేర్కొన్నారు.

జిల్లా బార్ అసోసియేషన్ చాంబర్‌లో చోరీ


చోరీ వివరాలు సేకరిస్తున్న సీఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం క్రైం, జనవరి7(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణలో గల బార్ అసోసియేషన్ చాంబర్‌లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు చొరబడి టీవీతోపాటు పక్కనే ఉన్న టీ స్టాల్‌లో రూ.3 వేల నగదును దొంగిలించారు. మంగళవారం ఉదయం విధులకు వచ్చిన న్యాయవాదులు బార్ అసోసియేషన్ భవనంలోకి వెళ్లి చూడగా టీవీ లేకపోవడం, టీ స్టాల్‌లో సైతం కౌంటర్‌లో ఉన్న నగదు పోవడంతో దొంగతనం జరిగిందని గుర్తించి టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని క్లూస్ టీం సహకారంతో వేలిముద్రలు సేకరించారు. జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీస చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఈశ్వరరావు కేసు నమోదు చేశారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్

శ్రీకాకుళం క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో కొంతకాలంగా పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్న ఓ నిందితుడిని ఒకటో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ కథనం మేరకు.. శ్రీకాకుళంలోని పెద్దరెల్లి వీధికి చెందిన జలగడుగుల తారా వికాస్ అలియాస్ వికాస్‌తో పాటు మరో 11 మంది గత ఏడాది సెప్టెంబరులో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో తొమ్మిది మందిని అదే నెలలో అరెస్ట్ చేయగా ముగ్గురు పరారీలో ఉన్నారు. మిగిలిన నిందితుల కోసం వన్‌టౌన్ పోలీసులు గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం నగరం లోకి వికాస్ వచ్చాడన్న సమాచారం తెలుసుకుని ఆయన కోసం గాలించగా ఎస్ఐ హరికృష్ణకు పట్టుబడ్డాడు. దీంతో వికాస్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అయితే ఇదే కేసులో ఒడిశాకు చెందిన ఇద్దరు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

16,600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

శ్రీకాకుళం క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో సారా తయారీ స్థావరాలపై రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లా, ఒడిశా రాష్ట్ర ఎక్సైజ్, పోలీసు అధికారులు సంయుక్తంగా మంగళవారం దాడులు నిర్వహించారు. శ్రీకాకుళం ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు ఆధ్వర్యంలో వేకువజామున మూడు గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు గంజాం జిల్లాలోని పోల్కసింగి, బాడజోల గొంగాపూర్‌లో దాడులు చేశారు. ఈ మేరకు పోట్క సింగిలో 5600 లీటర్లు, బాడజోలలో 3వేల లీటర్లు, గొంగాపూర్‌లో 8 వేల లీటర్లు కలిపి మొత్తం 83 డ్రమ్ముల్లో 16,600 వేల లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. దాడుల్లో శ్రీకాకుళం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతినాయుడు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ డీవీ రాజుతో పాటు ఒడిశా, ఆంధ్ర ఎక్సైజ్ పోలీసులు, సాధారణ పోలీసులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

గార, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బందరువాని పేటకు చెందిన వివాహిత కోనాడ బోడెమ్మ (55) మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అనారోగ్యంతో బాధపడుతున్న బోడెమ్మ మంగళవారం ఉదయం తలకు రాసుకునే తైలం తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు సందెయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ఎం.చిరంజీవిరావు తెలిపారు. ఆమెకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

కుటుంబ కలహాలతో భర్తను చంపిన భార్య

- హతుడిది కంచిలి మండలం

ఆదిభట్ల (రంగారెడ్డి జిల్లా), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో భర్తను భార్య చంపిన ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలానికి చెందిన అంకుల షణ్ముఖరావు (51) భార్య ఉమాపతితో కలిసి తుర్క యంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడలో 6 నెలల నుంచి అద్దెకు ఉంటున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే షణ్ముఖరావు మద్యానికి బానిసై పనికి వెళ్లకుండా నిత్యం భార్యను వేధించేవాడు. సోమవారం రాత్రి సైతం ఇద్దరు మద్యం సేవించి గొడవ పడ్డారు. మద్యం మైకంలో భర్తను భార్య విచక్షణా రహితంగా కొట్టడంతో అతను అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున ఇంటి యజమాని వచ్చి తలుపు కొట్టగా తలుపులు తీయలేదు. అనుమానం వచ్చి తలుపులను పగలకొట్టి చూడగా షణ్ముఖరావు గదిలో రక్తం మడుగులో పడి ఉన్నాడు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్ఐ రాజు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఇంట్లోనే ఉన్న భార్యను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇంటి యజమాని శ్రీనాథ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

శ్రీకాకుళం క్రైం, జనవరి7(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం న్యూకాలనీ డైమండ్ పార్క్ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని రెండో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు కథనం మేరకు.. డైమండ్ పార్క్ వద్ద బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు సీఐ ఈశ్వరరావు తన బృందంతో అక్కడకు చేరుకుని దాడులు నిర్వహించారు. ఈ మేరకు నగరానికి చెందిన నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారి వద్ద రూ.9 వేల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే శిరీష


రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

మందస,జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస గ్రామం సాయిబుల కాలనీ నుంచి ఎంఎం రోడ్డు వరకు రూ.27 లక్షలతో నిర్మించిన రోడ్డును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, అన్ని గ్రామాల్లో రోడ్లకు మరమ్మతులు చేపడతామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఏఈ యామిని, రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ డైరక్టర్ భావన దుర్యోధన, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, నేతలు డి.తిరుపతి, డొంకూరు త్రివేణి, జనసేన నాయకుడు సంతోష్‌పండా తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే బగ్గు


రోడ్డు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు.జలుమూరు, సారవకోట మండలాల్లో నూతనంగా మంజూరైన పలు గ్రామాల రోడ్ల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో రోడ్లు కనీసం మరమ్మతులకు నోచుకో లేదని, దీంతో ప్రజలు అనేక రీతులా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్లకు నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు వాన గోపి, చిన్నాల కూర్మినాయుడు, టీడీపీ నాయకులు వెలమల రాజేంద్రనాయుడు, బగ్గు గోవిందరావు, వెలమల చంద్రభూషణరావు, పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగ స్వామిబాబు, కింజరాపు సత్యం, ధర్మాన తేజకుమార్, కత్తిరి వెంకటరమణ, ఎంపీడీవో కె.అప్పలనాయుడు, పంచాయతీరాజ్ ఏఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతకు బహుమతి ప్రదానం


షణ్ముఖరావుకు బహుమతి అందిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రతినిధులు

కోటబొమ్మాళి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా కాకినాడలో జరుగు తున్న 17వ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన మహాసభల్లో సాంస్కృతిక విభాగాల్లో నిర్వహించిన పోటీ ల్లో కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు షన్ముఖరావు బహుమతులు సాధించారు. ఈ మేరకు 'టీచర్ 2024 ఏడీ' నాటిక, పప్పెట్రీ విభాగాల్లో ప్రథమ బహుమతులు సాధించగా ఆయనకు పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ రావు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో యుటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొండు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉన్న వారే సంపన్నులు


వివిధ రకాల పోషక పదార్థాలను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

పలాస, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆరోగ్యంగా ఉన్నవారే సంపన్నులని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి అన్నారు. మంగళవారం కళాశాలలో 'ఆహారంతో ఆరోగ్యం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యంపై విద్యార్థి దశ నుంచే శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థినులు బృందాలుగా ఏర్పడి చిరుధాన్యాలు, వివిధ కూరగాయలతో చేసిన సలాడ్‌లు, జ్యూస్, పోషకాహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. విజేతలకు ప్రిన్సిపాల్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, పీడీ మధు, అధ్యాపకులు వెంకటరమణ, శ్రీనివాస్ పట్నాయక్, ఎ.సునీత, ఆర్.దీపకుమార్, కె.రోజారాణి పాల్గొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయండి

జలుమూరు (సారవకోట), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఆంధ్రాయూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించనున్న ప్రధాని మోదీ బహిరంగ సభను విజయ వంతం చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులు, నేతలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం, ఎంపీడీవో సునీల్‌కుమార్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, టీడీపీ నాయకులు ధర్మాన తేజకుమార్, కత్తిరి వెంకటరమణ, జనసేన నేతలు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

నరసన్నపేట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా విశాఖపట్నంలో బుధవారం నిర్వహించనున్న బహిరంగసభ విజయవంతం అయ్యేందుకు అధికారు లు సమన్వయంతో పని చేయాలని ఎంపీడీవో మధుసూదనరావు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. గ్రామాల నుంచి ప్రజలను బస్సుల్లో తీసుకువెళ్లి, తిరిగి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ, కూటమి నాయకులు శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నందిగాం నుంచి ఆరు ప్రత్యేక బస్సులు

నందిగాం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): విశాఖలో బుధవారం జరగనున్న ప్రధానమంత్రి మోదీ బహిరంగ సభకు మండలం నుంచి ఆరు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో టి.రాజారావు తెలిపారు. అన్ని సచివాలయాలను కలుపుతూ బస్సులు విశాఖ బయలుదేరుతాయన్నారు. అధికారులు సమన్వయం చేయాలన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు


సోనియా

నందిగాం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): శివరాంపురం పంచాయతీ మొజ్జువాడ గ్రామానికి చెందిన అట్టాడ సోనియా (19) అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు హెచ్‌సీ డిల్లేశ్వరరావు తెలిపారు. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి పడుకున్న సోనియా మంగళవారం తెల్లవారే సరికి ఇంట్లో లేకపోవడంతో సాయంత్రం వరకు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించక పోవడంతో ఆమె తండ్రి అట్టాడ నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

జి.సిగడాం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పాలఖండ్యాం వద్ద మంగళవారం ఆటో బోల్తాపడడంతో ముగ్గురు విద్యార్థినులకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. రాజాం నుంచి పొందూరు వైపు ఆటోలో పేకల లిఖిత, అంబల్ల అశ్విని, బొంతల జయలక్ష్మితోపాటు మరో ముగ్గురు కలిసి కళాశాలకు వెళ్తున్నారు. పాలఖండ్యాం వద్ద ఆటో బోల్తాపడడంతో లిఖిత, అశ్విని, జయలక్ష్మిలకు గాయాలయ్యాయి. వీరిని రాజాం ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు.

పోలీసుల దర్యాప్తులో బయటపడిన చోరీ వ్యవహారం

ఎచ్చెర్ల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవరావుపేట గ్రామానికి చెందిన పూజారి వెంకటరమణ ఇంట్లో గత నెల 31న ఆరు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు మంగళవారం ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. ఓ చోరీ కేసులో నిందితుడిని పోలీసులు దర్యాప్తు చేయగా కేశవరావుపేట ఓ ఇంట్లో చోరీ చేసినట్లు అంగీకరించాడు. గతనెల 31న చోరీ జరిగినప్పటికీ వెంకటరమణ కుటుంబసభ్యులు గమనించలేదు. చోరీకి పాల్పడిన వ్యక్తి చెప్పే వరకు చోరీ జరిగినట్లు తెలియకపోవడం గమనార్హం. ఈనేపథ్యంలో వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. కాగా, ఇదే వ్యక్తి లక్ష్ముడుపేటలో ఓ వ్యక్తి ఇంట్లో కూడా అదే రోజు చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇటీవల ఈ ప్రాంతంలో జరిగిన చోరీ సంఘటనలతో ఈ వ్యక్తికి సంబంధం ఉందా లేదా అనే విషయాన్ని పోలీసులు ఆరా తీస్తున్నారు.

'ఉపాధి' పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర కమిషనర్ కృష్ణతేజ

ఎల్.ఎన్.పేట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ కృష్ణతేజ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎల్ఎన్ పేట, సరుబుజ్జిలి మండలాల ఉపాధి పథకం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో అమలు చేస్తున్న ఈ పథ కాన్ని ప్రభుత్వ నిబంధనల మేరకు చేపట్టాలన్నారు. కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్ల కుండా గ్రామాల్లోనే ఉపాధి పొందేలా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని, అందువల్ల సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు. వలస నివారణ బాధ్యత మీదేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే గ్రామస్థాయిలో రైతులకు ప్రయోజనం కలిగేలా పనులు చేపట్టాలని సూచించారు. ఏపీవోలు, ఇంజినీరింగ్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు స్వార్థంతో కూడిన పనులు కాకుండా ప్రత్యేకశ్రద్ధ వహించి గ్రామస్థులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఏపీడీ పి.రాధ, ఎల్.ఎన్‌పేట, సరుబుజ్జిలి మండలాల ఏపీవోలు శ్రీదేవి, పార్వతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో యువత భాగస్వామ్యం కావాలి



విజేత బృందానికి చెక్కు అందిస్తున్న నిర్వాహకులు విశ్వనాథం, ప్రిన్సిపాల్ గోవిందమ్మ

టెక్కలి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): భారతదేశ ప్రగతిలో యువకులు భాగస్వామ్యం కావాలని, వారే రథసారథులుగా వ్యవహరించాలని శ్రీ రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ ఉత్తరాంధ్ర కన్వీనర్ సంపతిరావు విశ్వనాథం అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యవతకు వివేకానందుడు ఆదర్శనీయుడన్నారు. ఈ పోటీల్లో మొదటి రెండు బహుమతులను పలాస, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు సాధించగా తృతీయ బహుమతిని బీఎస్‌జేఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు కైవసంచేసుకున్నారు. విజేతలకు నగదు పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందమ్మ, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్ కుమార్, కో- ఆర్డినేటర్ లూక్‌పాల్, రామకృష్ణ మఠం అధ్యక్షుడు ప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.


మా గ్రామానికి దారి చూపండి

- తహసీల్దార్‌కు పొన్నానపేట గ్రామస్థుల వినతి

నరసన్నపేట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జమ్ము పంచాయతీ పొన్నానపేటకు దారి చూపాలని గ్రామస్థులు తహసీల్దార్ ఆర్.సత్యనారాయణకు విన్నవించుకున్నారు. మంగళవారం ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. కూటమి ప్రభుత్వం మెటల్ రోడ్డు స్థానంలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని, రోడ్డు పనులు చేపడుతుండగా జమ్ము గ్రామానికి చెందిన ఎస్సీలు తమ భూమిలో రోడ్డు ఉందని అడ్డుకున్నారని, దీంతో పనులు నిలుపుదల చేశామన్నారు. 1973 నుంచి ఉన్న రోడ్డును అడ్డుకోవడంపై వారు ఆవేదన వ్యక్తంచేశారు.

వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామస్థులు పల్లి త్రినాథరావు, సింహాచలం, ప్రసాదరావు, పి.చిన్నవాడు, రామభద్రయ్య తదితరులు ఉన్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు.

రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు


రామచంద్రాపురం వద్ద రహదారికి వినియోగించిన మెటీరియల్‌ను తనిఖీ చేస్తున్న ఈఈ తదితరులు

జలుమూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపిస్తే కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని క్వాలిటీ కంట్రోల్ ఈఈ యూవీ ప్రసాద్ హెచ్చరించారు. జలుమూరు నుంచి రామచంద్రాపురం, సుబ్రమణ్యపురం మీదుగా బుడితి వరకు, మర్రివలస వరకు నిర్మించిన తారు రోడ్డు పనులను మంగళవారం పరిశీలించి నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ డీఈ ప్రదీప్, పంచాయతీరాజ్ డీఈ సత్యంనాయుడు, ఏఈ శ్రీధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

13 నుంచి కరవంజ జాతర

జలుమూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కరవంజలో కొలువు తీరిన కాశీ విశ్వేశ్వర స్వామి జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 13 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతరలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 14న మధ్యాహ్నం 2 గంటలకు వెయిట్ లిఫ్టింగ్, సంగిడీ, తీత సంగిడీలు, బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జుత్తు నేతాజీ, నీటి సంఘం అధ్యక్షుడు జుత్తు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ సంపతిరావు రామారావు, గ్రామ పెద్దల పాల్గొన్నారు.

మోసానికి పాల్పడితే చర్యలు

నరసన్నపేట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు తుకాల్లో మోసాలకు పాల్పడితే తగు చర్యలు తీసుకుంటామని తూనికల కొలతల ఇన్‌స్పెక్టర్ రాజారమేష్ అన్నారు. మంగళవారం స్థానికంగా కాటాలను పరిశీలించి సీళ్లు వేయించారు. కంప్యూటర్ కాటాలను వినియోగించే వ్యాపారులు నిబంధనలు పాటించాలన్నారు. తుకాల్లో అనుమానం వస్తే కొనుగోలుదారులు ఫిర్యాదు చేయాలన్నారు.

కళాకారుడి మృతికి సంతాపం

పలాసరూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): బొడ్డపాడు గ్రామానికి చెందిన సీనియర్ కళాకారుడు అప్పారావు మృతి తీరని లోటని ఉద్దానం రచయితల సంఘం సభ్యులు అన్నారు. కిడ్నీ వ్యాధితో మృతి చెందిన అప్పారావుకు మంగళవారం నివాళి అర్పించారు. డిసెంబరు 25న ఉద్దానం రచయితల సంఘం ఆధ్వర్యంలో మాకన్నపల్లిలో జరిగిన కార్యక్రమంలో అప్పారావుకు సత్కరించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమం జరిగిన పది రోజులకు మృతి చెందడం బాధాకరమని, కళాకారులకు తీరని లోటని సంఘం ప్రధాన నిర్వాహకుడు కుత్తుమ వినోద్ తదితరులు అన్నారు.

రేపు మండల సమావేశం

హిరమండలం, జనవరి7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కాశీప్రసాద రావు తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

టీడీపీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ

హరిపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనం బోల్తాపడి తీవ్రంగా గాయపడిన టీడీపీ సీనియర్ నాయకుడు కనగల తేజను మంగళవారం హరిపురంలో ఎమ్మె ల్యే గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శివాజీ పరామర్శించారు. ప్రమాదానికి కారణాలను అడిగి తెలు సుకుని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. నాయకులు విఠల్, భావన దుర్యోధన, రట్టి లింగరాజు, బైరిశెట్టి గున్నయ్య, పుల్లా వాసు, రుద్రయ్య, బాస్కరరావు ఉన్నారు.

అథ్లెటిక్స్‌లో ఝాన్సీ ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

పలాసరూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురంలో జరిగిన క్రీడా అథ్లెటిక్స్ విభాగంలో బొడ్డపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాపాక ఝాన్సీ ప్రతిభ కనబరిచి నట్లు పీడీ రాంజీ తెలిపారు. 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, హైజంప్ విభాగాల్లో జూనియర్ బాలికల విభాగంలో ప్రథమ, వ్యక్తిగత విభాగంలో చాంపియన్‌గా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు అభినందించారు.

ధ్రువపత్రాల జారీలో చేతివాటంపై ఫిర్యాదు

టెక్కలి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): టెక్కలి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జనన, మరణ ధ్రువ పత్రాల జారీలో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని వార్డు సభ్యుడు, న్యాయవాది దాడి ధర్మారావు సీఎం ఫిర్యాదుల కేంద్రానికి ఫిర్యాదు చేశారు. కార్యాలయంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు ధ్రువపత్రాల జారీకి నగదు తీసుకుంటున్నారని, విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా అటువంటివి తన దృష్టికి రాలేదని, వస్తే చర్యలు తీసుకుంటానని తెలిపారు.

సర్వే పారదర్శకంగా చేపట్టాలి

జలుమూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎల్సీడీసీ సర్వేని ఈనెల 20 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహిస్తున్నామని, దీనిని పారదర్శకంగా చేపట్టాలని అదనపు డీఎంహెచ్‌వో డా. తాడేల శ్రీకాంత్ కోరారు. పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమన్వయంతో సమన్వయంతో చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎస్.పద్మావతి, ఆరోగ్యవిస్తరణాధికారి చిన్నరాజులు, డీపీవో వాన సురేష్‌కుమార్ పాల్గొన్నారు.